తరంగాలు

రిపోర్టర్లు కావలెను

అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.

సంప్రదించండి...

94949 23460



ఎడిటర్ : రత్నం నాగరాజు

RNI . TELTEL / 2022 / 83463

జాతీయ దిన పత్రిక

# తరంగాలు

Tharangalu Daily News Paper

ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం....

హైదరాబాద్

ఆదివారం

02 నవంబర్ 2025

సంపుటి 75

సంచిక 3

పేజీలు 8

వెల రూ. 5.00

Epaper : WWW.tharangalu.comEpa

Published From: Hyderabad,Circulated: Hyderabad,Nalgonda,Khammam,Rangareddy,sangareddy,Warangal,Kurnool,Kadapa,Amaravathi,Krishna


# చెల్లికి వాటా ఇవ్వాల్సి వస్తుందని గెంటేశారు

## - జూబ్లీహిల్స్‌లో రేవంత్ రెడ్డి

- చెల్లిని ఇంట్లో నుంచి పంపిన వ్యక్తి మాగంటి సునీతను చూస్తారా అని ప్రశ్న
- కేటీఆర్ తన చెల్లి అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పాలన్న రేవంత్ రెడ్డి
- జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీకి ఒక్కసారి అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి



తరంగాలు, డెస్క్, నవంబర్ 01 చెల్లికి ఆస్తి ఇవ్వాల్సి వస్తుందనే కారణంతో ఇంట్లో నుంచి గెంటేశారని, అందుకు కవిత కన్నీటి పర్యంతమయ్యారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సొంత చెల్లిని ఇంట్లోంచి పంపిన వ్యక్తి మాగంటి సునీతను బాగా చూసుకుంటారని ఎలా నమ్ముతామని ఆయన ప్రశ్నించారు. ముందుగా కేటీఆర్ తన చెల్లి అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పాలని ఆయన నిలదీశారు. బోరబండలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఈ ప్రాంత సమస్యల పరిష్కారానికి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. చెల్లికి అన్నం పెట్టని వ్యక్తి చిన్నమ్మ బిడ్డకు బంగారు గాజులు చేయిస్తా అన్నట్లుగా కేటీఆర్ తీరు ఉందని ఎద్దేవా చేశారు. కేసీఆర్ వేల కోట్ల రూపాయల అక్రమాస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందని కవితపై కుట్ర చేశారని ఆరోపించారు. తండ్రిని అడ్డం పెట్టుకుని వేల కోట్ల రూపాయలు సంపాదించారని స్వయంగా కవిత చెప్పారని గుర్తు చేశారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానంలో మూడుసార్లు బీఆర్ఎస్ పార్టీకి అవకాశం ఇచ్చారని, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకి ఒక్క అవకాశం ఇవ్వాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాంత అభివృద్ధి బాధ్యతను తాను తీసుకుంటానని అన్నారు. ఇక్కడికి విజయోత్సవ ర్యాలీకి వస్తామని, పీజేఆర్ బోరబండగా నామకరణం చేస్తామని రేవంత్ రెడ్డి అన్నారు. పీజేఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జూబ్లీహిల్స్ ప్రాంతానికి అవసరమైన నిధులు ఇస్తామని తెలిపారు.

# ప్రధాని మోదీ చాలా మంచివారు

## - గుండె ఆపరేషన్లతో కోలుకున్న చిన్నారుల మాట

ఛత్తీస్‌గఢ్ లో ప్రధాని మోదీ పర్యటన

నవ రాయ్‌పూర్‌లో సత్యసాయి గుండె ఆసుపత్రి సందర్శన

గుండె ఆపరేషన్లతో కోలుకున్న 2,500 మంది చిన్నారులతో ముఖాముఖి

ప్రధానిని కలవడంపై చిన్నారులు ఆనందం, ఉత్సాహం



తరంగాలు, డెస్క్, నవంబర్ 01 : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఛత్తీస్‌గఢ్ పర్యటనలో భాగంగా నవ రాయ్‌పూర్‌లో భావోద్వేగపూరిత వాతావరణం నెలకొంది. 'దిల్ కీ బాత్' కార్యక్రమంలో భాగంగా శ్రీ సత్యసాయి సంజీవని చైల్డ్ హార్ట్ హాస్పిటల్‌ను ఆయన సందర్శించారు. 'గిఫ్ట్ ఆఫ్ లైఫ్' కార్యక్రమం కింద ఉచితంగా గుండె ఆపరేషన్లు చేయించుకుని కొత్త జీవితం పొందిన సుమారు 2,500 మంది చిన్నారులతో ప్రధాని ముచ్చటించారు. ఈ సందర్భంగా చిన్నారుల కేరింతలు, నవ్వులతో ఆ ప్రాంతమంతా సందడిగా మారింది. ప్రధాని మోదీ వారి వద్దకు వెళ్లి చదువు, ఆరోగ్యం, భవిష్యత్ లక్ష్యాల గురించి ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు. ఆయనతో మాట్లాడిన చిన్నారులు తమ ఆనందాన్ని పంచుకున్నారు. "ప్రధాని మోదీని కలవడం నాకు చాలా సంతోషంగా అనిపించింది" అని వారణాసికి చెందిన కృష్ణ విశ్వకర్మ ఆనందంగా చెప్పాడు. "మోదీ గారు నా పేరు అడిగి, దాన్ని మళ్లీ పలికారు. ఏ క్లాస్ చదువుతున్నావని కూడా అడిగారు. ఆ క్షణాన్ని ఎప్పటికీ మర్చిపోలేను" అని ఆయుషి సూర్యవంశి అనే బాలిక గుర్తుచేసుకుంది.....

2

# రేవంత్ రెడ్డితో కెనడా హైకమిషనర్, ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్ బృందాలు భేటీ

ఐటీ, ఫార్మా, ఏరోస్పేస్, డిఫెన్స్ అంశాలపై క్రిస్టోఫర్ కూటర్ బృందంతో చర్చ

తెలంగాణలో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని కెనడా హైకమిషనర్‌ను కోరిన సీఎం

భాగ్యనగరంలో అమలవుతున్న ఫ్రాన్స్ ప్రాజెక్టులను ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్‌కు వివరించిన సీఎం



02

# నిజామాబాద్ జిల్లాలో తల, చేయి నరికి మహిళ దారుణ హత్య - నగ్నంగా మృతదేహం

నవీపేట మండలం ఫకీరాబాద్ శివారులో ఘటన

తల, చేయి వేరుచేసి అతి కిరాతకంగా చంపిన దుండగులు

నెల రోజుల వ్యవధిలో రెండో హత్యతో స్థానికుల్లో భయం



02

# ప్రభుత్వం బెదిరింపులకు గురి చేస్తోంది.. బంద్‌కు పిలుపునిస్తున్నాం

## - తెలంగాణ ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య



- నవంబర్ 3 నుంచి నిరవధిక బంద్ చేస్తున్నామన్న సమాఖ్య చైర్మన్ రమేశ్ బాబు
- ఫీజు రీయింబర్సుమెంట్ బకాయిలపై 6 నెలలుగా ప్రభుత్వంతో చర్చలు జరిపామన్న రమేశ్ బాబు
- తమ మీద విజిలెన్స్ విచారణకు ఆదేశించారన్న రమేశ్ బాబు

02

# నా భర్త ఫోన్ ట్యాప్ చేశారు - కవిత

- ఎవరైనా బావ ఫోన్ ట్యాప్ చేస్తారా అని ప్రశ్న
- అవమానించినందు వల్లే పార్టీకి దూరమయ్యానని వెల్లడి



తరంగాలు, డెస్క్, నవంబర్ 01 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. తన భర్త ఫోన్‌ను కూడా ట్యాప్ చేశారని ఆమె ఆరోపించారు. సొంత బావ ఫోన్‌ను కూడా ట్యాప్ చేస్తారా అని ఆమె ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన వార్తలు వినగానే తనకు ఏదోలా అనిపించేదని ఆమె అన్నారు. 'జాగృతి జనం బాట' కార్యక్రమంలో భాగంగా కరీంనగర్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ, బీఆర్ఎస్‌లో తాను ఎన్నో అవమానాలకు గురయ్యానని ఆవేదన వ్యక్తం చేశారు. అన్యాయం జరిగితే భరిస్తాను... కానీ అవమానాన్ని మాత్రం సహించబోనని అన్నారు. ఆత్మగౌరవం కోసమే తాను పార్టీతో విభేదించానని ఆమె పేర్కొన్నారు.

# జూబ్లీహిల్స్‌లో ఓటర్లను రేవంత్ రెడ్డి బెదిరిస్తున్నారు

## - ఈసీకి బీజేపీ నేతల ఫిర్యాదు

- పథకాలు రద్దవుతాయని బెదిరిస్తున్నారని ఫిర్యాదు
- ఈసీని కలిసిన ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పాయల్ శంకర్
- రేవంత్ రెడ్డిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్




తరంగాలు, డెస్క్, నవంబర్ 01 :కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయకుంటే పథకాలు రద్దవుతాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఓటర్లను బెదిరిస్తున్నారని బీజేపీ నేతలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారం సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలపై ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పాయల్ శంకర్ పలువురు పార్టీ నాయకులతో కలిసి ఈసీకి ఫిర్యాదు చేశారు. పథకాలు రద్దవుతాయని బెదిరించిన ముఖ్యమంత్రిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. రెండు రోజుల ముందు, అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇవ్వడంపై కూడా బీజేపీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఉప ఎన్నికల సమయంలో ఓ వర్గం ఓట్ల కోసం ఆయనకు మంత్రి పదవి ఇస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బ్లాక్ మెయిల్ రాజకీయాలు: ఏలేటి మహేశ్వర్ రెడ్డి జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో, కాంగ్రెస్‌కు ఓటు వేయని వారికి ప్రభుత్వం నుంచి లభించే ప్రయోజనాలను ఆపేస్తామని ప్రజలను బెదిరించడాన్ని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తప్పుబట్టారు. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ, రేవంత్ రెడ్డిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశామని తెలియజేశారు. 23 నెలల కాంగ్రెస్ పాలనలో ఇచ్చిన 420 హామీలలో దేనిని కూడా అమలు చేయలేదని విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయకుంటే రేషన్ కట్ అవుతుందని, పెన్షన్ రాదని చెప్పడం బ్లాక్‌మెయిల్ కిందకు వస్తుందని అన్నారు.

# బీఆర్ఎస్ పార్టీలో చేరిన టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

## - కండువా కప్పి ఆహ్వానించిన కేటీఆర్

- టీడీపీలో సుదీర్ఘకాలం పని చేసిన శ్రీనివాస్ నాయుడిని పార్టీలోకి ఆహ్వానిస్తున్నామన్న కేటీఆర్
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని విజ్ఞప్తి
- కాంగ్రెస్ ఇచ్చిన ఒక్క హామీని అమలు చేయలేదని విమర్శ



తరంగాలు, డెస్క్, నవంబర్ 01 : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సమయంలో తెలంగాణ తెలుగుదేశం పార్టీ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరికలు జరిగాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ నాయుడు, పలువురు పార్టీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. కేటీఆర్ వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ ...

2

# రేవంత్ వ్యాఖ్యలు దేశ గౌరవాన్ని దెబ్బతీశాయి

## - బండి సంజయ్

- మన సైనికుల ధైర్య సాహసాలను రేవంత్ అవమానించారన్న బండి
- ఉగ్రవాదంపై మోదీ చర్యలను ప్రస్తావించిన బండి సంజయ్
- సీఎం రేవంత్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్

తరంగాలు, డెస్క్, నవంబర్ 01 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ బండి సంజయ్ తీవ్రంగా స్పందించారు. జూబ్లీహిల్స్‌లో ఎన్నికల ప్రచారం సందర్భంగా పాకిస్థాన్ గురించి సీఎం చేసిన వ్యాఖ్యలు దేశ గౌరవాన్ని, సైనికుల ధైర్యసాహసాలను అవమానించేలా ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పిస్తూ, బేషరతుగా క్షమాపణ ....

02



## ప్రభుత్వం బెదిరింపులకు గురి చేస్తోంది.. బంద్‌కు పిలుపునిస్తున్నాం

### - తెలంగాణ ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య

మొదటిపేజి తరువాయి..

తరంగాలు, డెస్క్, నవంబర్ 01 : ప్రభుత్వం తమను బెదిరింపులకు గురి చేస్తోందని ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య ఛైర్మన్ రమేశ్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని ఫతేమైదాన్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఫీజు రీయింబర్సుమెంట్ బకాయిలపై గత 6 నెలలుగా ప్రభుత్వంతో చర్చలు జరిపామని, ప్రస్తుతం రూ. 1,200 కోట్లు ఇవ్వాలని కోరామని తెలిపారు. మిగిలిన బకాయిల చెల్లింపులపై ఒక స్పష్టమైన ప్రణాళికను రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరినట్లు చెప్పారు.

అయితే, ప్రభుత్వం రూ. 300 కోట్లు మాత్రమే ఇచ్చిందని, మిగిలిన రూ. 900 కోట్లు దీపావళికి విడుదల చేయాలని, అలాగే నవంబర్ 1 నాటికి పెండింగ్ బకాయిలన్నీ చెల్లించాలని కోరినట్లు ఆయన తెలిపారు. ఈ బకాయిల గురించి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కతో సహా అందరినీ కలిశామని, కానీ అధికారులు తమ విజ్ఞప్తిని పెడచెవిన పెట్టారని ఆయన అన్నారు. ప్రభుత్వం తమను బెదిరింపులకు గురి చేస్తోందని, తమ మీద విజిలెన్స్ విచారణకు ఆదేశించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

తెలంగాణలోని అన్ని వృత్తి విద్యా కళాశాలలు నవంబర్ 3 నుంచి నిరవధికగా మూసివేయబడతాయని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రేపటిలోగా సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు. ఈ బంద్ సమయంలో పరీక్షలను వాయిదా వేయాలని విజ్ఞప్తి చేశారు. నవంబర్ 6న అన్ని కళాశాలల సిబ్బందితో కలిసి దాదాపు లక్ష మందితో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఆయన అన్నారు.

నవంబర్ 10 లేదా 11న 10 లక్షల మంది విద్యార్థులతో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. ఒకటి రెండు కళాశాలలకు మాత్రమే బకాయిలు ఎందుకు చెల్లించారో చెప్పాలని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. 10 శాతం లంచం తీసుకుని నిధులు విడుదల చేశారా అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అవసరమైతే ఎమ్మెల్యేలు, అధికారుల ఇళ్లను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. బంద్ కారణంగా విద్యార్థులు, తల్లిదండ్రులకు కలిగే అసౌకర్యానికి ఆయన క్షమాపణలు తెలిపారు.

## ప్రధాని మోదీ చాలా మంచివారు

### - గుండె ఆపరేషన్లతో కోలుకున్న చిన్నారుల మాట

మొదటిపేజి తరువాయి.. "ఆయన చాలా మంచివారు" అని యాషిక అనే చిన్నారి ఉత్సాహంగా చెప్పింది. 2017లో ఆపరేషన్ చేయించుకున్న కావ్య మిశ్రా మాట్లాడుతూ, "ప్రధానిని కలవడం నాకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చింది" అని తెలిపింది. వేలాది మంది చిన్నారులకు ఉచితంగా గుండె సంబంధిత చికిత్స అందిస్తూ పునర్జన్మ ప్రసాదిస్తున్న ఆసుపత్రి యాజమాన్యాన్ని, వైద్యులను, నర్సులను ప్రధాని మనస్ఫూర్తిగా అభినందించారు. వారి సేవలు అమూల్యమైనవని కొనియాడారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బ్రహ్మకుమారీలు ఏర్పాటు చేసిన 'శాంతి శిఖర్' ఆధ్యాత్మిక కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం, నవ రాయ్‌పూర్‌లోని నూతన ఛత్తీస్‌గఢ్ శాసనసభ భవనంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ భవనాన్ని సౌరశక్తి, వర్షపు నీటి సంరక్షణ వంటి పర్యావరణ హితమైన పద్ధతులతో నిర్మించారు. అంతకుముందు, రాష్ట్ర రజతోత్సవ వేడుకల సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ప్రధాని మాట్లాడుతూ.. భారతదేశం ప్రజాస్వామ్యానికి తల్లిలాంటిదని అన్నారు. "మన గిరిజన సమాజం తరతరాలుగా ప్రజాస్వామ్య సంప్రదాయాలను నిలబెట్టింది. బస్తర్‌లోని మురియా దర్బార్ సంస్కృతి దీనికి నిదర్శనం. ఈ సంప్రదాయానికి కొత్త విధానసభలో చోటు కల్పించడం సంతోషంగా ఉంది" అని ఆయన పేర్కొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీలో చేరిన టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

### - కండువా కప్పి ఆహ్వానించిన కేటీఆర్

మొదటిపేజి తరువాయి..

మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీలో సుదీర్ఘకాలం పనిచేసిన శ్రీనివాస్ నాయుడును పార్టీలోకి సాదరంగా ఆహ్వానిస్తున్నామని అన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించిందని, ఎన్నో హామీలు ఇచ్చిందని, కానీ ఒక్కటీ నెరవేర్చలేదని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశామని అన్నారు. ఎమ్మెల్యే, మంత్రి లేదా ముఖ్యమంత్రి పదవి ఏదైనా ప్రజలు పెట్టిన భిక్ష అని ఆయన అన్నారు. అలాంటి ప్రజలను 'మీరు ఓటు వేయకుంటే ఏమీ ఇవ్వం' అని బెదిరించడమేమిటని ప్రశ్నించారు. ఈ దేశంలో ఎన్టీఆర్, ఇందిరా గాంధీలను కూడా ప్రజలు ఓడించారని గుర్తు చేశారు. అలాంటిది ప్రజలకు మూడడుగుల రేవంత్ రెడ్డి ఎంత అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి తనకు తాను చక్రవర్తిగా భావిస్తున్నారని మండిపడ్డారు. సంక్షేమ పథకాలు ఆపేస్తామని బెదిరిస్తే, అదే ప్రజలు జూబ్లీహిల్స్‌లో ఆయన తోక కట్ చేసే ఆలోచనలో ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఈ ఉప ఎన్నికల్లో బుద్ధి చెబుతారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక చేసిన ఒక్క మంచి పని చెప్పాలని నిలదీశారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ 420 హామీలు ఇచ్చిందని కానీ ఒక్క పని కూడా చేయలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి అంటే ప్రజల సొమ్ముకు ధర్మకర్త అని గుర్తించాలని అన్నారు. ముఖ్యమంత్రి గారూ, మనది ఐదేళ్ల తాత్కాలిక ఉద్యోగం మాత్రమే, ఆ తర్వాత ప్రజలకు ఇష్టం లేకుంటే మనల్ని చెత్తబుట్టలో పడేస్తారని హెచ్చరించారు. ఇటీవల జూబ్లీహిల్స్‌లో జరిగిన కార్యకర్తల సమావేశంలో పార్టీ అభ్యర్థి మాగంటి సునీత తన భర్త గుర్తుకు వచ్చి ఏడిస్తే, దానిని కూడా కాంగ్రెస్ రాజకీయం చేసిందని మండిపడ్డారు.

## రేవంత్ రెడ్డితో కెనడా హైకమిషనర్, ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్ బృందాలు భేటీ





మొదటిపేజి తరువాయి..

తరంగాలు, డెస్క్, నవంబర్ 01 : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కెనడా హైకమిషనర్ క్రిస్టోఫర్ కూటర్, ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్ మార్క్ లామీ బృందాలు వేర్వేరుగా సమావేశమయ్యాయి. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని ముఖ్యమంత్రి వారిని ఆహ్వానించారు. కెనడా హైకమిషనర్ క్రిస్టోఫర్ కూటర్ బృందంతో జరిగిన సమావేశంలో ఐటీ, ఫార్మా, ఏరో స్పేస్, డిఫెన్స్, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాల్లో కెనడాతో భాగస్వామ్యంపై చర్చించారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కెనడా హైకమిషనర్‌కు వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని ఆయన కోరారు. స్టార్టప్స్, ఎడ్యుకేషన్, అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్స్‌లో పెట్టుబడులకు అవకాశాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్ మార్క్ లామీ బృందంతో జరిగిన సమావేశంలో, భాగ్యనగరంలో అమలవుతున్న ఫ్రాన్స్ ప్రాజెక్టులపై చర్చించారు. నగరంలో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని ముఖ్యమంత్రి వారిని కోరారు. హైదరాబాద్‌లో ఫ్రెంచ్ బ్యూరో కార్యాలయాన్ని మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

## రేవంత్ వ్యాఖ్యలు దేశ గౌరవాన్ని దెబ్బతీశాయి

### - బండి సంజయ్



మొదటిపేజి తరువాయి..

చెప్పాలని డిమాండ్ చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లను ఉద్దేశించి రేవంత్ రెడ్డి కొన్ని వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో పాకిస్థాన్ మనపై దాడి చేసినా భారత్ స్పందించలేదన్న అర్థం వచ్చేలా సీఎం మాట్లాడారని బండి సంజయ్ ఆరోపించారు. "జూబ్లీహిల్స్‌లో భారత్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన అవమానకర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాను. ఆయన వ్యాఖ్యలు పాకిస్థాన్‌లోని ఉగ్రశిబిరాలను ధ్వంసం చేసిన మన సైనికుల ధైర్యసాహసాలకు అవమానం" అని బండి సంజయ్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ప్రతి భారతీయుడు మన జవాన్ల సాహసం పట్ల గర్వపడుతున్నాడని ఆయన తెలిపారు. "ఆపరేషన్ సింధూర్ ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందింది. ఇది ఉగ్రవాదంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీసుకున్న కఠిన చర్యలకు ప్రతీక. దేశ రక్షణ కోసం ప్రాణాలను పణంగా పెట్టిన సైనికులకు, భారత ప్రజలకు సీఎం రేవంత్ బేషరతుగా క్షమాపణ చెప్పాలి," అని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

## పదవికి రాజీనామా చేయడానికి కూడా రెడీ

### – తలసాని శ్రీనివాస్ యాదవ్



తరంగాలు, డెస్క్, నవంబర్ 01 : మాజీ మంత్రి, సనత్ నగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కంటోన్మెంట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సంచలన సవాల్ విసిరారు. శనివారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలోనే హైదరాబాద్ అద్భుతంగా అభివృద్ధి చెందిందని అన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి రెండేళ్లు గడుస్తున్నా, హైదరాబాద్‌కు రేవంత్ రెడ్డి చేసిందేమీ లేదని ఆయన విమర్శించారు. "జూబ్లీహిల్స్‌లో ఓటమి భయం పట్టుకోవడం వల్లే అజారుద్దీన్‌కు మంత్రి పదవి కట్టబెట్టారు" అని తలసాని ఆరోపించారు. కాంగ్రెస్‌కు ఓటు వేయకపోతే రేషన్ కార్డులు, బియ్యం ఆగిపోతాయంటూ ఆ పార్టీ నేతలు ప్రజలను బెదిరిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలతో సంక్షేమ పథకాలు ఎలా అమలు చేయించాలో బీఆర్ఎస్‌కు బాగా తెలుసని ఆయన వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికల్లో జూబ్లీహిల్స్‌లో గెలిచేది బీఆర్ఎస్ పార్టీయే అని తలసాని ధీమా వ్యక్తం చేశారు. అత్యంత భారీ మెజార్టీతో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత అసెంబ్లీలో అడుగుపెడతారని ఆయన జోస్యం చెప్పారు.

## నిజామాబాద్ జిల్లాలో తల, చేయి నరికి మహిళ దారుణ హత్య - నగ్నంగా మృతదేహం



మొదటిపేజి తరువాయి..

తరంగాలు, డెస్క్, నవంబర్ 01 : నిజామాబాద్ జిల్లాలో అత్యంత పాశవికమైన సంఘటన చోటుచేసుకుంది. నవీపేట మండలం ఫకీరాబాద్ మిట్టాపూర్ శివారులో గుర్తుతెలియని మహిళ మృతదేహం తీవ్ర కలకలం రేపింది. బాసర ప్రధాన రహదారి సమీపంలో మొండెం మాత్రమే ఉన్న మహిళ శవాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వివరాల్లోకి వెళితే, దుండగులు మహిళను అత్యంత కిరాతకంగా హత్య చేశారు. ఆమె తలను మొండెం నుంచి వేరు చేశారు. అంతేకాకుండా, ఒక చేయి, మరో చేతి వేళ్లను కూడా నరికివేశారు. మృతదేహం నగ్న స్థితిలో పడి ఉండటం చూసి స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో ఆధారాల కోసం గాలింపు చేపట్టారు. పోలీస్ కమిషనర్ సాయి చైతన్య స్వయంగా ఘటనా స్థలాన్ని పరిశీలించి, దర్యాప్తును వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. పోలీసులు కేసు నమోదు చేసి, మృతురాలిని గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. కాగా, నెల రోజుల వ్యవధిలోనే ఇదే ప్రాంతంలో ఇద్దరు మహిళలు హత్యకు గురికావడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరుస ఘటనలతో తమ భద్రతపై భయం నెలకొందని వారు వాపోతున్నారు. నిందితులను వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు.

## హైదరాబాద్ మెట్రో రైలు ప్రయాణ వేళల్లో మార్పులు



తరంగాలు, డెస్క్, నవంబర్ 01 : హైదరాబాద్ మెట్రో రైలు ప్రయాణికులకు ఒక ముఖ్యమైన ప్రకటన వెలువడింది. ఈ నెల 3వ తేదీ నుంచి మెట్రో రైలు ప్రయాణ వేళల్లో మార్పులు చోటు చేసుకున్నాయని హైదరాబాద్ మెట్రో రైలు ఒక ప్రకటన ద్వారా తెలియజేసింది. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు అన్ని టెర్మినల్లలో, అన్ని రోజుల్లో ప్రయాణ సదుపాయం అందుబాటులో ఉంటుందని సంస్థ స్పష్టం చేసింది. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని యాజమాన్యం కోరింది. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ అధికంగా ఉండటం వలన ఉద్యోగులు, విద్యార్థులు మరియు నగరవాసులు మెట్రో రైలు ప్రయాణానికి ప్రాధాన్యతనిస్తున్నారు. ఈ నేపథ్యంలో, ప్రయాణికులందరికీ అనుకూలంగా ఉండేలా ఎల్ అండ్ టీ మెట్రో రైలు ప్రయాణ వేళల్లో మార్పులు చేసింది.

# ఇందిరమ్మ ఇల్లు - పేదోడి జీవిత కళ



జఫర్గడ్ ప్రతినిధి, నవంబర్ 01, (తరంగాలు) : మండల కేంద్రంలో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసినటువంటి ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో స్థానిక శాసనసభ్యులు కడియం శ్రీహరి చేతుల మీదుగా ప్రొసీడింగ్ కాపీ అందుకున్న బండ్ల సుదర్శన్ నూతన గృహ నిర్మాణానికి భూమి పూజలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు తో కలిసి స్టేషన్ ఘనపూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మంచాల ఎల్లయ్య పాల్గొని కొబ్బరికాయ కొట్టి ముగ్గు పోసి అనంతరం మిఠాయి తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం లబ్ధిదారును ఉద్దేశించే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చినటువంటి ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వం ఇచ్చే నియమ నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణం చేసుకొని ఎటువంటి సాంకేతిక ఆటంకాలు రాకుండా గృహ నిర్మాణం చేసుకొని ఇందిరమ్మ రాజ్యంలో సంతోషంగా నీ కుటుంబం ఉండాలని. అలాగే రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి మీ ఆశీస్సులు ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మోహన్ రావు, అన్నెబోయినా బిక్షపతి, జ్యోతి యాకయ్య, ఇల్లందల మొగిలి, ప్రజాప్రతినిధులు ముఖ్య నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎకరానికి రూ.25 వేలు నష్టపరిహారం చెల్లించాలి

**- ఉప్పుగల్లు బీజేపీ నాయకుల డిమాండ్**



జఫర్గడ్ ప్రతినిధి, నవంబర్ 01, (తరంగాలు) మండలం లోని ఉప్పుగల్లు గ్రామంలో ఇటీవల వచ్చిన మొంథా తుఫాన్ వల్ల ఉప్పుగల్లు గ్రామంలో ఉన్న వరి పంట నీట మునగడం తో పాటు పత్తి చేలు, మొక్కజొన్న చేను,మిరప పంట ఎక్కువగా నష్టపోవడం జరిగింది. ఇప్పటివరకు అధికారులు వచ్చి ఏ విధమైనటువంటి సర్వే చేయలేదు. అంతేకాకుండా కూనూరు బ్రిడ్జి నుండి తమ్మడపల్లి వెళ్లే దారిలో ఉన్నటువంటి పంట పోలాలు తమ్మడపల్లి చెరువు మత్తడి ద్వారా వచ్చినటువంటి నీటిలో మునిగిపోయి సుమారు అయిదు ఎకరాలు కోత గురి కావడం జరిగింది. వారు పంటతోపాటు భూమిని కూడా నష్టపోయారు తమ్ముడపెల్లి,ఉప్పుగల్లు మెయిన్ రోడ్డుకు ఆకేరు వాగు చుట్టుపక్కల గల ఉన్న భూములు సుమారు 100 ఎకరాల భూమి కోత కు గురై రైతులు పంటతోపాటు వారి భూమిని కూడా కోల్పోవాల్సి వచ్చింది. మరికొన్ని చోట్ల పంట పొలాల మీద ఇసుకమేటలు కప్పుకున్నాయి కావున ప్రభుత్వం తక్షణమే స్పందించి వ్యవసాయ అధికారులతో పాటు రెవెన్యూ అధికారులను పంపించి సర్వే చేయించి పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి 25 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలి. భూమి కోతకు గురైన రైతులకు ఎకరానికి 30 లక్షల రూపాయల నష్టపరి హారం చెల్లించి సదర్ రైతులను ఆదుకోవాలని ఉప్పుగల్లు భారతీయ జనతా పార్టీ తరఫున డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి గడ్డం రాజు గౌడ్, జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు నేరెళ్ల రాజు,జిల్లా నాయకులు బుర్ర తిరుపతి గౌడ్, నాయిని యాదగిరి గౌడ్, మూల యాకయ్య గౌడ్,పొనుగోటి గోపాల్ రావు,మరియు శక్తి కేంద్ర ఇన్చార్జ్ పవన్ గౌడ్, రైతులు, మోడం నాగరాజు గౌడ్,అబ్బాటి దుర్గారెడ్డి, చిల్లర రాజు,మూడం కుమార్, వెంకటరాజు, నాయిని సుజాత, పూజరి మొండయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ వస్తున్న ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

తరంగాలు, డెస్క్, నవంబర్ 01 : జెడ్డా నుంచి హైదరాబాద్‌కు వస్తున్న ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు రావడంతో దానిని దారి మళ్లించారు. హైదరాబాద్ విమానాశ్రయంలో ల్యాండ్ చేయకుండా ముంబైకి తీసుకువెళ్లి సురక్షితంగా ల్యాండ్ చేశారు. హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, విమానాశ్రయ అధికారులకు శనివారం ఉదయం 5:30 గంటల ప్రాంతంలో ఒక మెయిల్ వచ్చింది. ఆ మెయిల్‌లో జెడ్డా నుంచి హైదరాబాద్ వస్తున్న ఇండిగో విమానంలో మానవ బాంబు ఉన్నట్లు రాసి ఉందని తెలిపారు. 1984లో మద్రాస్ విమానాశ్రయంలో జరిగిన బాంబు దాడి తరహాలో ఈ దాడి జరుగుతుందని, ఎల్‌టీటీఈ, ఐఎస్ఐ ఈ దాడికి ప్రణాళిక వేశాయని ఆ మెయిల్‌లో పేర్కొన్నట్లు వెల్లడించారు. దీంతో అప్రమత్తమైన విమానాశ్రయ అధికారులు పైలట్‌కు సమాచారం అందించారు. విమానాన్ని ముంబైలో ల్యాండ్ చేయాలని సూచించారు.



# నలంద ఇన్స్టిట్యూషన్స్ లో ఘనంగా ఫ్రెషర్స్ డే నిర్వహణ

- ఘనంగా నిర్వహించిన కళాశాల కరస్పాండెంట్ డోలి సత్యనారాయణ
- ప్రతి విద్యార్థి విద్యపై మక్కువతోనే అత్యున్నత స్థానానికి ఎదగాలి : సమ్మి గౌడ్ చిలువేరు
- ముఖ్య అతిథిగా హాజరైన చిలువేరు సమ్మయ్య గౌడ్





మహబూబాబాద్ ప్రతినిధి, నవంబర్ 01, తరంగాలు : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ, పారామెడికల్ కాలేజ్ విద్యార్థుల ఫ్రెషర్స్ డే శనివారం ఆర్థి గార్డెన్ లో కళాశాల కరస్పాండెంట్ డోలి సత్యనారాయణ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిగా చిలువేరు సమ్మయ్య గౌడ్ హాజరైనారు. ఈ సందర్భంగా డోలి సత్యనారాయణరావు మాట్లాడుతూ... డిగ్రీ ప్రథమ విద్యార్థులకు వెల్ కమ్ తెలియజేస్తూ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులకు విద్యపై ఏ విధంగా ఇష్టాన్ని ఏర్పరచుకొని అత్యున్నత స్థానాన్ని అధిరోహించడానికి విద్యాపరంగా ఏ విధంగా చదవాలో తెలుపుతూ ప్రతి ఒక్క విద్యార్థి విద్యతోనే తన జీవితంలో ఉన్నత స్థానాన్ని చేరడానికి కృషి చేయాలని అన్నారు. అదేవిధంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న సమ్మి గౌడ్ ఫౌండేషన్ అధినేత చిలువేరు సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ... విద్యార్థులకు ఫ్రెషర్స్ డే శుభాకాంక్షలు తెలుపుతూ విద్యార్థులందరూ వారు అనుకున్న స్థానాన్ని చేరాలంటే చదువుతోపాటు సంస్కారాన్ని అలవర్చుకొని ముందడుగు వేయాలని అన్నారు అదేవిధంగా వారి తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి మెదులుకోవాలని ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని దాన్ని సాధించే విధంగా ముందుకు సాగాలని జీవితంలో ప్రతి విద్యార్థి తన కుటుంబంతో పాటు సమాజ శ్రేయస్సుకు పాటుపడే విధంగా అత్యున్నత స్థానాలను చేరడానికి తన ఉన్నతమైన విద్యా దోహదపడుతుందని అన్నారు చదువు ప్రతి విద్యార్థికి సంపాదనే కాకుండా నిరుపేదల కు అండగా నిలబడే విధంగా మీ చదువులు ఉపయోగపడాలని అన్నారు. మీరు చదువుతున్నటువంటి నలంద డిగ్రీ పారామెడికల్ కాలేజీలకి ఇంకా అత్యున్నతమైన గుర్తింపును తెచ్చే విధంగా మంచి ర్యాంకులు సాధించి మీ తల్లిదండ్రులకు,మీ కరస్పాండెంట్ కి,మీ ఉపాధ్యాయులకు, మంచి పేరు తేవాలని అన్నారు. అనంతరం కళాశాల యజమాన్యం వచ్చిన అతిథులను శాలువాలతో సత్కరించి వారి అమూల్యమైన మాటలను విద్యార్థులకు అందజేసినందుకు ప్రతి ఒక్కరికి పేరు పేరునా ధన్యవాదాలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో కళాశాలడైరెక్టర్ శ్రీమతి డోలి సాధన సత్యనారాయణ,వై. కృష్ణ ప్రసాద్, గర్ల్స్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సాధానందం, బుర్ర గోవర్ధన్, తెలంగాణ ఉద్యమకారులు చాగంటి కిషన్, రచయిత, ఉపాధ్యాయులు మల్లేశం,కళాశాల యజమాన్యం ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆడబిడ్డలను కాపాడుకోవడం అందరి భాధ్యత

- శిశువిక్రయాలు, బాల్య వివాహాలు, బాలికల పై లైంగిక దాడులు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



నల్గొండ ఆర్సీ, నవంబర్ 1, తరంగాలు : ఆడబిడ్డను కాపాడుకోవడంలో భాగంగా జిల్లాలో శిశువిక్రయాలు, బాల్య వివాహాలు, బాలికల పై లైంగిక దాడుల వంటివి జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. అన్ని సంక్షేమ శాఖల అధికారులు ఆర్ సి ఓ లు ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని జిల్లాలో ఎక్కడ శిశు విక్రయాలు జరగకుండా, అలాగే బాల్య వివాహాలు, హాస్టల్ విద్యార్థులపై లైంగిక దాడులు వంటివి జరగకుండా చూడాల్సిన అవ-సరం ఉందని అన్నారు. ఎక్కడైనా శిశు విక్రయాలు జరిగితే సంబంధిత శాఖల అధికారులపై చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. జిల్లాలో ఇటీవల శిశు విక్రయాలు , బాల్య విద్యార్థులపై లైంగిక దాడులు,బాల్యవివాహాలు, తదితర సంఘటనల నేపథ్యంలో శనివారం ఆమె తన చాంబర్లో సంక్షేమ అధికారులు, ఆర్సిఓలతో సమీక్ష నిర్వహించారు. అభివృద్ధి చెందిన సమాజంలో ఇంకా శిశు విక్రయాలు, బాలికలపై లైంగిక దాడుల వంటివి జరగడం సిగ్గుచేటని అన్నారు. అన్ని శాఖలు ఈ విశయాలపై క్షేత్రస్థాయిలో పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని అన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిశు గృహాలపై విస్తృత ప్రచారం కల్పించాలని, బిడ్డలను కన్న ఏ తల్లి దండ్రులు శిశువులను అమ్మడం ,దత్తత ఇవ్వడం వంటివి చేయకుండా ఉండాలని కోరారు. ఇలాంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే చట్టాలు కఠినంగా ఉంటాయన్న విషయం మర్చిపోవద్దని తెలిపారు. సిడిపిఓలు వారి పరిధిలోని గ్రామాలలో విస్తృతంగా పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించాలని, ఆడపిల్లల కోసం ప్రత్యేకించి బేటి బచావో, బేటి పడావో వంటి కార్యక్రమాలు ఉన్నాయని తెలియజేయాలని, అన్ని పాఠశాలలు, హాస్టళ్లు, అంగన్వాడి కేంద్రాలు, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీలలో ఈ విషయాలపై విస్తృత చర్చ నిర్వహించాలన్నారు. జిల్లాలోని దేవరకొండ, పెద్దవూర, తదితర ప్రాంతాలలో ఇలాంటి సంఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఈ విషయం పై సిడిపిఓ లు మరింత అప్రమత్తంగా ఉండి పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాలన్నారు. దేవరకొండ, నేరేడు గోమ్ము ,చందంపేట, పెద్దవూర, అడవిదేవులపల్లి వంటి మండలాలలో శిశువిక్రయాలు జరగకుండా, అలాగే బాల్య వివాహాలు వంటివి జరగకుండా అవగాహన కల్పించాలని, ఇందుకు ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. అంతేకాక వాల్ పోస్టర్లు, కరపత్రాలు, ఫ్లెక్సీలు, చిన్న చిన్న వీడియోల ద్వారా సమాజంలోని అందరికీ చైతన్యం కలిగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వచ్చేవారం సి డి పి ఓ లు, సూపర్వైజర్లతో ఈ విషయంపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించేందుకు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు మండలాలలో అన్ని పాఠశాలలు, కేజీబీవీలు, రెసిడెన్షియల్ స్కూళ్లను తిరిగి ఎక్కడ ఎలాంటి సంఘటన జరగకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి కృష్ణవేణి, గృహనిర్మాణ శాఖ పీడి రాజ్ కుమార్, సాంఘిక సంక్షేమ డిడి శశికళ, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి చత్రు నాయక్, జిల్లా ఉప వైద్యాధికారి వేణుగోపాల్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి తదితరులు ఉన్నారు.

# చెకుముకి సైన్స్ టెస్ట్ విద్యార్థుల్లో సైన్స్ అవగాహన పెంచుతుంది

**- ఎంఈఓ కే అరుంధతి**



నల్గొండ ఆర్సీ, నవంబర్ 1, తరంగాలు చెకుముకి సైన్స్ టెస్ట్ విద్యార్థుల్లో సైన్స్ అవగాహన పెంచుతుందని ఎంఈఓ కే అరుంధతి అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి సైన్స్ టెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో నల్గొండ ఎంఈఓ కే. అరుంధతి పాల్గొని పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చెకుముకి సైన్స్ టెస్ట్ అనేది విద్యార్థుల్లో దాగి ఉన్న సైన్సు పరిజ్ఞానాన్ని బయటకు తీయడానికి ఎంతగానో ఉపయోగ పడుతుందని నేటి సమాజంలో విద్యార్థులకు సైన్స్ పట్ల అవగాహన పెంపొందించుకోవాలని, మూఢనమ్మకాలకు దూరంగా ఉండడం కోసం సైన్స్ విలువలను తెలుసుకోవాలని అన్నారు. ముఖ్యంగా ఈ మధ్యకాలంలో సోషల్ మీడియాలో వచ్చే మూఢనమ్మకాల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యార్థులు సైన్స్ అవగాహన పెంచుకొని వాళ్ళ తల్లిదండ్రులని సైన్స్, మూఢనమ్మకాల మధ్యన వ్యత్యాసాలని అర్థమయ్యే విధంగా తెలియజేయాలని వారన్నారు విద్యార్థుల్లో సైన్స్ అవగాహన పెరిగితే రానున్న కాలంలో వారి జీవన విధానంలో అనేక మార్పులు వస్తాయని మూఢనమ్మకాలకు దూరంగా ఉండి నమ్మకం మూఢనమ్మకం మధ్య వ్యత్యాసాలు తెలుసుకోవాలని అన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి జంజరాల సైదులు మాట్లాడుతూ చెకుముకి సైన్స్ టెస్ట్ ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా నవంబర్ 07 పాఠశాల స్థాయి నవంబర్ 21మండల స్థాయి నవంబర్ 28 జిల్లాస్థాయి డిసెంబర్ 12 నుండి 14 వరకు రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించడం జరుగుతుందని జన విజ్ఞాన వేదిక ప్రజల్లో విద్యార్థుల్లో యువకుల్లో యువతుల్లో దాగివున్న మూఢనమ్మకాలని వ్యతిరేకిస్తూ సైన్స్ పట్ల అవగాహన పెంచుతుందని దానిలో భాగంగానే విద్యార్థులకు విద్యాభ్యాసంతో పాటు సైన్స్ పట్ల అవగాహన పెంచడం కోసం జనవిజ్ఞాన వేదిక చెకుముకి సైన్స్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందని ఈ యొక్క కార్యక్రమానికి విద్యార్థులు ఉపాధ్యాయులు పాఠశాల యాజమాన్యం సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ సభ్యురాలు బైరి గౌతమి,వై సునీత, ఫాతిమా, సరోజ, ఉమా తదితరులు పాల్గొన్నారు.

## రివిజన్ ప్రక్రియను సమర్ధవంతంగా చేపట్టాలి

### - రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

వరంగల్ ప్రతినిధి, నవంబర్ 1, తరంగాలు : స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను సమర్ధవంతంగా చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి రాష్ట్ర అదనపు ముఖ్య ఎన్నికల అధికారి లోకేష్ కుమార్, ఇతర అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు-ఎన్నికల అధికారులు, ఈ ఆర్ ఓ లతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ 2002 ఎలక్టోరల్ జాబితాతో నియోజకవర్గాల వారిగా 2025 ఎలక్టోరల్ జాబితా మ్యాపింగ్ చేసి 4 కేటగిరీలుగా విభజించడం జరిగిందని, కేటగిరీ ఏ లో 1987 కంటే ముందు జన్మించి 2002, 2025 ఎలక్టోరల్ జాబితాలో నమోదు కాబడిన వారు, కేటగిరీ బి లో 1987 కంటే ముందు జన్మించి 2002 ఓటరు జాబితాలో లేకుండా 2025 జాబితాలో నమోదు కాబడిన వారు, కేటగిరీ సి లో 1987 నుంచి 2002 మధ్యలో జన్మించి 2025 ఓటరు జాబితాలో నమోదు కాబడిన వారు, కేటగిరీ డి లో 2002-2007 మధ్యలో జన్మించిన వారిగా విభజించడం జరిగిందని తెలిపారు. మొదట కేటగిరి ఎ జాబితాను బి ఎల్ ఓ యాప్ ద్వారా నిర్ధారించుకోవడం జరుగుతుందని, ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 63 లక్షల ఓటర్లను నిర్ధారించడం జరిగిందని, మిగిలిన 12 లక్షల ఓటర్ల నిర్ధారణ త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. కేటగిరి సి, క్యాటగిరి డి లలోని ఓటర్లను కేటగిరి ఎ కు మ్యాపింగ్ చేసే ప్రక్రియను మెరుగుపరచాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జి డబ్ల్యూ ఎం సి కమిషనర్ చాహత్ బాజ్పాయ్, అదనపు కలెక్టర్ జి సంధ్యా రాణి, వరంగల్ నర్సంపేట ఆర్డీవోలు సుమా ఉమారాణిలు, వరంగల్, వర్ధన్నపేట తహసీల్దార్లు, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ డి టి రంజిత్ తదితరులు పాల్గొన్నారు.






## సమర్ధవంతంగా నష్టపరిహారం వివరాలు నమోదు చేయాలి

### ఎన్యుమరేటర్లను ఆదేశించిన వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద







వరంగల్ ప్రతినిధి,1 నవంబర్, తరంగాలు సక్రమంగా సమర్ధవంతంగా నష్టపరిహారం వివరాలు నమోదు చేయాలని ఎన్యుమరేటర్ల వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వరంగల్ నగరంలోని పలు ప్రాంతాల్లో నీటిమునిగిపోవడం, గృహ నష్టం, ఆస్తి నష్టం చోటుచేసుకున్న నేపథ్యంలో, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం నగరంలోని ఎన్టీఆర్ నగర్, బృందావన్ కాలనీలలో క్షేత్ర స్థాయిలో పర్యటించారు. కలెక్టర్ ప్రభావిత ప్రాంతాలను సందర్శించి, వరదల వల్ల ప్రజలకు జరిగిన నష్టాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. నష్టం వివరాలను సేకరిస్తున్న ఎన్యుమరేటర్ల పని తీరును సమీక్షించి, గృహాల్లో నీరు చేరిన, పూర్తిగా, పాక్షికంగా దెబ్బతిన్న గృహాల వివరాలు పక్కగా నమోదు చేయాలని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వరంగల్ పర్యటనల్లో బాధితులకు ప్రభుత్వం ఉందని, అధైర్య పడొద్దని హామీ ఇస్తూ ఉత్తర్వులు జారీచేశారని,పూర్తిగా నష్టం జరిగిన గృహాలకు 1.30 లక్షలు, పాక్షికకంగా నష్టం జరిగిన గృహాలకు రూ 6,500, వరద నీటితో జలమయమైన గృహాలకు రూ 15 వేలు,నష్టం వాటిల్లిన గుడిసెలకు రూ 8 వేలు, ప్రభుత్వం నుండి సహాయంగా అందజేయడం జరుగుతుందన్నారు. అలాగే, బాధిత కుటుంబాలకు అవసరమైన తక్షణ సహాయం అందించడంలో ఎటువంటి నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా చూడాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలు తక్షణమే పరిష్కరించబడేలా చర్యలు తీసుకోవాలని, పునరావాసం పరిశుభ్రత కార్యక్రమాలను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, రెవెన్యూ అధికారులు, ఎన్యుమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆధైర్య పడొద్దు.. ప్రభుత్వం అండగా ఉంటుంది

### - వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద





వరంగల్ ప్రతినిధి, నవంబర్ 1, తరంగాలు : రైతులెవ్వరూ అధైర్య పడవద్దని,ప్రభుత్వం మీకు అండగా ఉంటుందని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సతీష్ శారద అన్నారు. మొందా తుఫాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు జిల్లాలోని నెక్కొండ మండలం రెడ్ల వాడ, వెంకటాపూర్ గ్రామాల్లో పర్వతగిరి మండలంలోని ఏనుగల్లు లో నేలకొరిగిన వరి పంట,బొప్పాయి పంటలను, దెబ్బతిన్న రహదారులను వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడుతూ వరదల వల్ల జరిగిన పంట, ఆస్తి నష్టాల వివరాలను వెంటనే నమోదు చేసి సమర్పించాలని అధికారులకు ఆదేశించారు. నెక్కొండ మండలం వెంకటపూర్ గ్రామంలో భారీ వర్షాలకు దెబ్బతిన్న రహదారిని కలెక్టర్ పరిశీలించారు. వర్షాల వల్ల వెంకటాపూర్ కాజ్ వే పై నీరు ప్రవహించి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్న దృష్ట్యా వెంటనే బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించా రు. రెడ్లవాడ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి అందిస్తున్న సేవలను సేవలపై ఆరా తీశారు. ఇప్పటివరకు గ్రామంలో చేసిన ఫీవర్ సర్వే పై వైద్యాధికారులు అడిగి తెలుసుకు న్నారు. వర్షాల తర్వాత సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఎం హెచ్ ఓ డాక్టర్ సాంబశివరావు, జిల్లా హార్టికల్చర్ అధికారి శ్రీనివాసరావు, జిల్లా రోడ్ల భవనాల అధికారి రాజేందర్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు దామోదర్ రెడ్డి, తహసీల్దార్ రాజ్ కుమార్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.







## నూతన ఎంపీడీవోను కలిసిన ఖానాపురం మండల లంబాడి జేఏసీ అధ్యక్షులు గుగులోతు కిషన్ నాయక్



ఖానాపురం, నవంబర్ 01, తరంగాలు : ఖానాపురం మండల నూతన ఎంపీడీవో అద్వైత ను లంబాడి జేఏసీ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఖానాపురం మండల లంబాడి జేఏసీ అధ్యక్షులు గుగులోతు కిషన్ నాయక్ మాట్లాడుతూ మండలంలోని గిరిజన తండాల అభివృద్ధికి అధికారులు సహకరించాలని కోరారు. గిరిజన తండాలలో గిరిజనులకు అందుతున్న ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని అన్నారు. గిరిజనులలో సమాజం పట్ల అవగాహన పెంపొందించాలన్నారు. పౌర హక్కులు వైద్య ఆరోగ్య విద్యపై పలు సామాజిక అంశాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఖానాపురం మండల లంబాడి జె ఏ సి ముఖ్య సలహా దారులు జాటోత్ సదర్ లాల్ నాయక్,జాటోత్ బాలు నాయక్,లంబాడి మండల నాయకులు బాధవత్ బాల కిషన్ నాయక్,భూక్యా వెంకన్న నాయక్,గుగులోతు బాలు నాయక్, తేజవత్ యాకుబ్ నాయక్,బోడ పుల్ సింగ్ నాయక్,మూడు వీరన్న నాయక్,జాటోత్ రమేష్ నాయక్,ఖానాపురం గ్రామ లంబాడి జేఏసీ అధ్యక్షులు భూక్యా నాగ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మొంథా తుఫాన్ తో ధ్వంసమైన రోడ్డు

### - ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి ఆదేశాల మేరకు మరమత్తు పనులు చేయించిన మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి

రాయపర్తి, నవంబర్ 1, తరంగాలు మొంథా తుఫాన్ తో ధ్వంసమైన రోడ్డును పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి మరమత్తు పనులు చేయించారు. మొంథా తుఫాన్ బీభత్సానికి పెరికేడు గ్రామం నుండి గణేష్ కుంట తండాకు వెళ్లే మార్గం పూర్తిగా ధ్వంసం కావడంతో రాకపోకలు, ఇబ్బంది కరంగా మారాయి. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు స్పందించిన ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి ఆదేశాల మేరకు రాయపర్తి మండల పార్టీ నాయకులు, స్థానికులతో కలిసి, రోడ్డు మార్గాన్ని పరిశీలించి, జెసిబి, ట్రాక్టర్లతో రోడ్డు మరమ్మత్తు పనులను రాయపర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డీ చేయించారు. ఈ కార్యక్రమంలో రవీందర్ రెడ్డి వెంట మండల ముఖ్య నాయకులు రెంటాల గోవర్ధన్ రేడ్డి,మండల ఏస్సీ సేల్ అధ్యక్షుడు చిర్ర మల్లయ్య, మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ బండి రాజేంద్రప్రసాద్,పెరికేడు గ్రామ పార్టీ అధ్యక్షుడు తీగల సాయిలు,బండి కుమార్, మునవత్ రవి, సేనాధిపతి, గణేష్ కుంట తండా గ్రామ పార్టీ అధ్యక్షుడు శ్రీను, రఘు, భాస్కర స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.






## వివాహ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్సీ కర్నె



తరంగాలు, యాదాద్రి భువనగిరి, నవంబర్ 01: సంస్థాన్ నారాయణపురం మండలం జనగాం గ్రామానికి చెందిన గజవెల్లి వెంకటయ్య గుప్తా కుమారుని వివాహానికి శనివారం మాజీ శాసనమండలి సభ్యులు కర్నే ప్రభాకర్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు దర్శనం నర్సింహ, కరంటోతు దశరథ, శంకర్, తదితరులు పాల్గొన్నారు

## బక్క శ్రావ్య కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



వర్ధన్నపేట ప్రతినిధి, నవంబర్ 01, తరంగాలు ప్రమాదవశాత్తు వాగులో కొట్టుకుపోయి మృతి చెందిన బక్క శ్రావ్య కుటుంబాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పరామర్శించారు. మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన అకాల వర్షాల కారణంగా జఫర్గడ్ శంకర్ తండ సమీపంలో వాగు ఉధృతంగా ప్రవహిస్తుండగా, వాగు దాటే ప్రయత్నంలో వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని దమ్మన్నపేట గ్రామానికి చెందిన బక్క శ్రావ్య దురదృష్టవశాత్తు వాగులో కొట్టుకుపోయి మృతి చెందింది. ఈ ఘటనపై బాధ వ్యక్తం చేసిన వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు శనివారం ఆమె నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా బక్క శ్రావ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ఆర్థిక, నైతికంగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఏఎంసీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, ఐనవోలు ఆలయ కమిటీ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి, మండల అధ్యక్షులు ఎద్దు సత్యనారాయణ, సీనియర్ నాయకులు చోటు వలి,పోశాల వెంకన్న గౌడ్,అక్బర్, గ్యాదరీ భాస్కర్, యూత్ నాయకుడు కుల్లా యాకాంతం,రాజు, మండల, గ్రామ-స్థాయి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వర్షాల వల్ల కలిగిన నష్టాలపై శాఖల వారీగా "నివేదికలను త్వరగా సమర్పించండి"

### - వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద




వరంగల్ ప్రతినిధి, 1 నవంబర్, తరంగాలు : ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల కలిగిన నష్టాలపై శాఖల వారీగా నివేదికలు త్వరగా సమర్పించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. శనివారం కలెక్టరెట్ లోని కాన్ఫెరెన్స్ హాల్ లో బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయి తో కలసి భారీ వర్షాల కారణంగా జిల్లా వ్యాప్తంగా వాటిల్లిన నష్టాల మీద వరంగల్ జిల్లావ్యాప్తంగా, జిల్లాలోని జిడబ్ల్యూ ఎంసీ పరిధిలో వివిధ శాఖ ల వారీగా తయారు చేయాల్సిన నివేదికలు, తీసుకోవలిసిన చర్యల గురించి అధికారులతో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో భారీ వర్షాల వల్ల జరిగిన నష్టం పై పూర్తిగా నష్టం జరిగిన, పాక్షికంగా నష్టం జరిగిన గృహాలు వివరాలు, జలమయమైన గృహాలు, కూలిపోయిన గుడిసెల నష్టం వివరాలను ప్రధానంగా వరంగల్ ఖిలా వరంగల్ నగరాల్లో ఇంటింటికి వెళ్లి నష్టం వివరాలు నమోదు చేసి సోమవారం నాటికి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా జరిగిన పంట నష్టం, మత్స్య సంపద నష్టం, లైవ్ స్టాక్ న, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి రోడ్లు, జాతీయ రహదారుల, విద్యుత్ కు సంబంధించి పడిపోయిన కరెంట్ పోల్స్, ట్రాన్స్ఫార్మర్స్, జరిగిన విద్యుత్ లైన్లు వివరాలు, ప్రభుత్వ విద్యాసంస్థలు, పాఠశాలలో అంగన్వాడి భవనాలు, కమ్యూనిటీ హాల్స్ గ్రామపంచాయతీ భవనాలకు జరిగిన నష్టం, భారీ మధ్య చిన్న తరహా నీటి పారుదలకు జరిగిన నష్టం, మంచినీటి సరఫరా ట్యాంకులకు పైప్లైన్ లకు జరిగిన నష్టం వివరాలను ప్రభుత్వం నుండి నిర్దేశించిన ప్రొఫార్మాలు క్షేత్రస్థాయిలో ఫోటోలతో సహా సేకరించి త్వరితంగా సమర్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. క్లౌడ్ బరస్ట్ నిత్యకృత్యమైనందున ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రభుత్వానికి సమర్పించుటకు గాను జిల్లా, మండల స్థాయి తాత్కాలిక, శాశ్వత, చేపట్టే ఉపశమన చర్యలపై కార్యచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. బలియా కమిషనర్ చాహత్ బాజ్పాయ్ మాట్లాడుతూ వరంగల్ నగరం లో భారీ వర్షాలకు చేరడం వల్ల అనేక కాలనీలలోని గృహాలు జలమయ్యాయని, వాటి వివరాలతో పాటు నగరంలోని రహదారులు , నష్టం ఫిల్టర్ బెడ్లలో మోటార్లకు జరిగిన నష్టం కమ్యూనిటీ బావులు నీటి సరఫరా కు జరిగిన నష్టం వివరాలు కూడా అధికారులు సేకరించాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, ఆర్డీవోలు సుమ, ఉమారాణి సంబంధిత శాఖల తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి విలయాన్ని రాజకీయం చేయడం సిగ్గుచేటు





వర్ధన్నపేట ప్రతినిధి, నవంబర్ 01, తరంగాలు : ప్రకృతి విలయాన్ని కూడా రాజకీయం చేయడం సిగ్గుచేటు అని వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు అన్నారు. శనివారం పర్వతగిరి మండల పరిధిలోని సోమారం గ్రామం తో పాటు వర్ధన్నపేట మండల పరిధిలోని ఇల్లంద, కట్ర్యాల గ్రామాల్లో తుఫాన్ ధాటికి ఇండ్లు, పంటలు నష్టం వాటిల్లిన పొలాలను వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల ప్రకటించిన ఎకరాకు రూ. 10వేలు ఆర్థిక సహాయం నష్టపోయిన ప్రతి రైతుకు అందేలా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు. అధికారులు పారదర్శకంగా పనిచేసి ప్రతి రైతుకు పరిహారం అందేలా చూడాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన ఎకరాకు 10వేల ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే పునరుద్ఘాటిం చారు. వెంటనే నష్టపోయిన రైతులు, కౌలు రైతులకు కూడా పరిహారం అమలు అవుతుందని ఎవ్వరు అధైర్య పడొద్దని నియోజకవర్గ ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ ఆర్థిక సహాయం వరి, పత్తి పంటల రైతులకు తక్షణ ఉపశమనం కలిగిస్తుందని తెలిపారు. మరియు 56, 54 వ డివిజన్ ప్రజలను తుఫాన్ కోలుకోలేని దెబ్బకొట్టిదని గుర్తు చేసుకున్నారు. శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే చేసి నష్టపోయిన ప్రతి ఒక్కరినీ ఆదుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. క్షేత్రస్థాయిలో సమస్యలను అర్థం చేసుకుంటేనే ప్రభుత్వ సహాయం సమర్థవంతంగా అందించడానికి అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే కె. ఆర్ నాగరాజు అన్నారు. అందుకోసమని సీఎం రేవంత్ రెడ్డి వరద బాధితులను పరామర్శించే ఒదుకు వస్తే సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న మెదడు లేని నాయకుడు కాంగ్రెస్ అసమర్థ పాలన అని అంటున్నారని వారికి కొంచమైన సిగ్గుండాలని ప్రకృతి విలయాన్ని ఎవ్వరు ఆపలేరని వారు అర్థం చేసుకోవాలని అన్నారు. గత ప్రభుత్వంలా మాటలు ఇచ్చి తప్పించుకునే ప్రభుత్వం మాది కాదని చేతల ప్రభుత్వం కాబట్టే తక్షణమే సహాయం ప్రకటించి నష్టపోయిన ప్రతి ఇంటిని, ప్రతి ఒక్క కుటుంబాన్ని, రైతులు,కౌలు రైతులకు సైతం ఆదుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఏఎంసీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, ఐనవోలు ఆలయ కమిటీ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, వరంగల్ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు బొంపల్లి దేవేందర్రావు, జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్ రావు, బ్లాక్ కాంగ్రెస్





అధ్యక్షుడు అబిడి రాజిరెడ్డి, మండల అధ్యక్షులు ఎద్దు సత్యనారాయణ, జాటోతు శ్రీనివాస్ నాయక్, ఓ బి సి జిల్లా ప్రధాన కార్యదర్శి నాంపల్లి యాదగిరి, సీనియర్ నాయకులు మహమ్మద్ చోటు, మల్లెపాక సమ్మయ్య, గడ్డం సమ్మయ్య, గుంటి కుమారస్వామి, శ్రీపాది సతీష్, కార్యకర్తలు,మరియు వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలి

### - వరద ప్రభావిత ప్రాంతాలలో పర్యటించి,ప్రజల సమస్యలను తెలుసున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

వరంగల్ ప్రతినిధి, నవంబర్ 01, తరంగాలు : చెరువు కోత కారణంగా నీరు చేరిన ప్రాంతాల్లో తక్షణ చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సూచించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 56వ డివిజన్ గోపాలపురం చెరువు కోతకు గురై నీట మునిగిన టీఎన్జీవోస్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, జవహర్ నగర్ కాలనీలలో శనివారం స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకొని, నీటిని వీలైనంత త్వరగా తొలగించి, ప్రజలు ఇళ్లకు తిరిగి వెళ్లే పరిస్థితులు కల్పించాలని ఆదేశించారు. అనంతరం జవహర్ కాలనీ కి చెందిన మహమ్మద్ రజియా ఇల్లు నీట మునిగి ఇంట్లో ఆహార వస్తువులన్నీ నాశనం అయ్యి అని ఎమ్మెల్యే కు చెప్పగా తన వంతుగా ఆర్థిక సాయం అందజేసా-మని తెలిపారు. అదే విధంగా జవహర్ కాలనీ లో మైలాయి విజయ, సమ్మక్క, ఇందిరమ్మ ఇల్లు శాంక్షన్ చేయించి తక్షణమే అధికారులతో మాట్లాడి మంజూరు చేయించి కొబ్బరి కాయ భూమి పూజ కార్యక్రమం చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని, అవసరమైతే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా వరద ప్రభావంతో నీటి మునిగిన ప్రతి ప్రతి ఇంటికి రాష్ట్ర ప్రభుత్వం సర్వే నిర్వహించి 15వేల రూపాయలు మరియు రేషన్ బియ్యం అందజేస్తున్నామని ప్రజలకు తెలిపారు. ఈ స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.











# మృతుని కుటుంబానికి అండగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దోకూరి ప్రభాకర్ రెడ్డి

కల్వకుర్తి, నవంబర్ 1, తరంగాలు ప్రతినిధి : తలకొండపల్లి మండలం చీపునుంతల గ్రామానికి చెందిన గుమ్మడి నర్సిహ్మాసామెలు అనారోగ్యం తో శనివారం తెల్లవారు జామున మృతి చెందింది. విషయం గ్రామానికి చెందిన కాంగ్రేస్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న కాంగ్రేస్ పార్టీ మండల అధ్యక్షులు డోకూరి ప్రభాకర్ రెడ్డి మృతుని కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపి పార్టీ తరుపున రూ.3వేలు ఆర్థిక సహాయం అంద జేశారు. ఎలాంటి అవసరం ఉన్న సహాయం చేయడానికి ఎల్లవేళలా అండగా ఉంటానని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు డోకూరీ ప్రభాకర్ రెడ్డి బాధిత కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్సి సెల్ అధ్యక్షులు చెన్నకేశవులు, గ్రామ మాజీ సర్పంచ్ రఘుపతి, మాజీ కృష్ణయ్య, రామకిష్టయ్య, జంగయ్య, పెంటయ్య, గోపాల్, చెన్నయ్య, మల్లయ్య,చెన్నకేశవులు,



# కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

## - ఎమ్మెల్యే కొనింటి మాణిక్

తరంగాలు / సంగారెడ్డి, నవంబర్ 1 : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు, డీసీఎంహెచ్ చైర్మన్ మల్కాపురం శివకుమార్ లు అన్నారు. సంగారెడ్డి జిల్లా నాఫెడ్ వారిచే మార్కుఫెడ్ వారి ఆధ్వర్యంలో ఏడాకులపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లో ఏర్పాటు చేసిన సోయబీన్ కొనుగోలు కేంద్రాన్ని శనివారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్వింటాకు రూ. 5328లు మద్దతు ధర ఇవ్వడం జరుగుతుందని, కావున రైతులు దళారుల వద్దకు తీసుకోనిపోయి మోసపోకుండా రైతులు సోయబీన్ కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి ఇట్టి అవకశాన్ని సద్వినియోగం చేసుకొని రైతులు లబ్ది పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహా గౌడ్, సొసైటీ వైస్ చైర్మన్ కాంతమ్మ, ఏడాకులపల్లి గ్రామ మాజీ సర్పంచ్, మాజీ రైతు బంధు ఆధ్యక్షులు ప్రభు పటేల్, సొసైటీ డైరెక్టర్లు అనాంత్ రామ్ గౌడ్, శ్రీనివాస్ రాంచందర్ అగ్రికల్చరల్ ఏ ఓ వెంకటేశం ఏఈవో వేద, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# ఆరు గ్యారెంటీలా పేరుతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ

## - జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారంలో.. మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి

తరంగాలు / జుబ్లిహిల్స్, నవంబర్ 01 : ఆరు గ్యారెంటీలా పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం మోసం చేసిందని మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి మండిపడ్డారు. జుబ్లిహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె ఇంటింటికి తిరిగి ఓటర్లను కలిసి బి ఆర్ ఎస్ అభ్యర్థి మాగంటి సునీతను గెలిపించాలని కోరారు. మాగంటి సునీత గెలుపు కోసం ప్రజా ప్రతినిధులు, శ్రేణులతో కలసి ప్రత్యేక వ్యూహాలతో ప్రచార పర్వాన్ని సాగిస్తున్నారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ ఇంటింటికి తిరుగుతూ ఓటును అభ్యర్థిస్తూ ముందుకు వెళు ృతున్నారు. శనివారం ఎర్రగడ్డ డివిజన్ లోని సుల్తాన్ నగర్ లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక ఐరన్ షాపులో రజక మహిళలతో మాట్లాడారు. కారు గుర్తుకు ఓటు వేసి మాగంటి సునీతా గోపీనాథ్ భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రజక మహిళలు మాట్లాడుతూ కెసిఆర్ హయాంలో మాకు ఉపాధి కల్పించి



రజకులకు ఐరన్ షాపులకు ఫ్రీ కరెంట్ ఇచ్చారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రావడం వలన మళ్ళీ ప్రజలకు కష్టాలు మొదలు అయ్యాయని పేర్కొన్నారు. మా షాపులకు ఫ్రీ కరెంటు కట్ చేసి బిల్లు కొడుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. మహిళలకు నెలకు 2500 ఇస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని అన్నారు. అనంతరం పద్మా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందని అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ ల పేరుతో చేసిన మోసాలను ప్రజలకు గుర్తు చేస్తూ 10 సంవత్సరాలు బిఆర్ఎస్ ప్రభుత్వం కేసీఆర్ పాలన గురించి తెలియజేసారు. రెండు సంవత్సరాల కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, గాలికి వదిలేసిన హామీలను ప్రజలకు వివరించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో అన్ని వర్గాల ప్రజలు సంక్షేమ పథకాలు అంది సంతోషంగా ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ప్రజలకు కష్టాలు నెలకొల్పిందని గుర్తు చేశారు. మహిళలకు నెలకు 2500 ఇస్తామన్నారు, పెన్షన్ పెంచుతామని మోసం చేశారనీ ఎద్దేవ చేశారు. కారు గుర్తుకు ఓటు వేసి బిఆర్ఎస్ పార్టీ మాగంటి సునీతా గోపినాథ్ ను గెలిపించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ ప్రచారంలో స్థానిక నాయకులతో పటు మెదక్ నాయకులు అహ్మద్, లింగా రెడ్డి, జుబేర్ అహ్మద్, కుమార్ యాదవ్, రాజ్ కుమార్, నరేష్, రంజిత్, లడ్డు తదితరులు ఉన్నారు.

# సర్వేల్ నుండి చౌటుప్పల్ వెళ్లే రోడ్డు మరమ్మతులు చేయించిన చలమల్ల

తరంగాలు, యాదాద్రి భువనగిరి, నవంబర్ 01: సంస్థాన్ నారాయణపురం మండలం సర్వేల్ నుండి చౌటుప్పల్ వెళ్లే రోడ్డు మార్గం పూర్తిగా గుంతల మయంగా మారింది. మేజర్ గ్రామ పంచాయతీ కావడంతో పాటు గ్రామంలో దేశంలోనే మొట్ట మొదటి గురుకుల పాఠశాల ఉండటం వల్ల రద్దీ పెరగడంతో వాహనాలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. ఈ విషయం గ్రామ ప్రజలు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చలమల్ల కృష్ణ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే సానుకూలంగా స్పందించి అత్యవసరం ఉన్న చోట సర్వేల్ గ్రామం నుండి అల్లందేవి చెరువు గ్రామం వరకు డోజర్ పెట్టీ గుంతల మయంగ మారిన రోడ్డుకు ఇరువైపుల మరమత్తులు చేయించారు. ఈ కార్యక్రమంలో చలమల్ల యువసేన అధ్యక్షులు మునుగోడు నియోజకవర్గం శ్రీరామోజు హరికుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బోయ నర్సింహ్మా, పగిళ్ల శీను, ఎల్లంకి నరసింహా, పగిళ్ల కృష్ణ, ఎల్లంకి జంగయ్య, నలరాజు మహేష్, వడ్డేపల్లి రాజు, చిలుక రాజు అనిల్, బోయ అనిల్, సుర్గి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు .



# బాధితుడికి పరుపాటి శ్రీనివాస్ రెడ్డి పరామర్శ,ఆర్థిక సహాయం



రాయపర్తి, నవంబర్ 1, తరంగాలు అనారోగ్యంతో గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడిని ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేశారు. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కిష్టపురం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ గిద్దె రేణుక భర్త గిద్దె యాకయ్య అనారోగ్యంతో హైదరాబాద్ గాంధీ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి శనివారం గాంధీ హాస్పిటల్ కు వెళ్లి యాకయ్య ను పరామర్శించి,ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ కార్యక్రమం లో రాయపర్తి మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, రాయపర్తి మాజీ ఎంపీటీసీ ఐత రామ్ చందర్, మండల పార్టీ నాయకులు ఆశ్రఫ్ పాషా, చందు రామ్, చిలువేరు సాయి గౌడ్, ల్యాదేళ్ల ప్రశాంత్ పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం

## - రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ. 10వేలు అందజేత





కల్వకుర్తి, నవంబర్ 1, తరంగాలు ప్రతినిధి: మృతుల కుటుంబాలకు రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ. 10వేలు అందజేశారు. కడ్తాల్ మండలంలోని ఎక్వాయిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మాదాపూర్ గ్రామానికి చెందిన బొజ్జ ఎల్లమ్మ శుక్రవారం సాయంత్రం మృతి చెందింది. విషయం తెలుసుకున్న కడ్తాల్ మాజీ జెడ్పిటిసి, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్ స్థానిక నాయకులతో కలిసి ఎల్లమ్మ భౌతికదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి,బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఎల్లమ్మ కుటుంబ సభ్యులకు జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 5000 రూపాయల ఆర్థిక సహాయం అందించగా స్థానిక బీఆర్ఎస్ నాయకులు జెనిగల మహేష్ యాదవ్ 5000 రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా కడ్తాల్ మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు పోతుగళ్ళ మహేష్ శుక్రవారం హార్ట్ ఎటాక్ తో మృతి చెందగా మహేష్ కుటుంబాన్ని పరామర్శించి ట్రస్టు ద్వారా 5000 రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఎక్కువయి పల్లి బిఆర్ఎస్ నాయకులు ఎల్లమ్మ కుటుంబ సభ్యులకు 5వేల రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ డైరెక్టర్ వీరయ్య, సేవ్య నాయక్, వెంకటయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ, మాజీ సర్పంచ్ వెంకటేష్, మాజీ ఉపసర్పంచ్ ముత్యాలు, నాయకులు బిక్షపతి, పాండు, మహేష్, కిష్టయ్య, రాకేష్, రాజేష్, నవీన్, నాయకులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న తెలంగాణ బిక్షం

## - పోలీసుల ఆధ్వర్యంలో మెగా రక్త దాన శిబిరం



తరంగాలు / యాదాద్రి భువనగిరి, నవంబర్ 01: సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రము లో శనివారం ఉదయం కోహెడ గ్రామానికి చెందిన సాయి కుమార్ అనే వ్యక్తి పొరపాటున తన ఐ ఫోనును అంబేద్కర్ చౌరస్తా వద్ద పోగొట్టుకోవడం జరిగినది. ఈ విషయాన్ని గమనించిన బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు తెలంగాణ బిక్షం ఇట్టి ఫోన్ ను జాగ్రత్త పరిచాడు. ఫోన్ పోగొట్టుకున్న సదరు వ్యక్తి తిరిగి అంబేద్కర్ చౌరస్తా వద్ద వెతుకులాడుతుండగా ఈ విషయాన్ని గమనించిన తెలంగాణ బిక్షం మానవతా దృక్పథంతో తన ఫోనును అందజేసి జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సెల్ ఫోన్ లు ఇప్పుడు కేవలం సమాచార సాధనం కాదని, మన బ్యాంకు అకౌంట్, వ్యక్తిగత సమాచారం అంతా అందులోనే ఉంటుందని, పొరపాటున దుండగుల చేతిలో పడితే తన జీవితంతో పాటు కుటుంబ సభ్యుల జీవితాలు సైతం ఆగం అవుతాయని, కావున జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాకారం నాగరాజు, దూసరి వెంకటేష్ గౌడ్, విడమ్ సాయి కిషోర్ నేత, కట్ట లింగస్వామి, అచ్చిని ప్రవీణ్ కుమార్, చిలువేరు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక సేవే బిఆర్ఆర్ ఫౌండేషన్ లక్ష్యం

## - ఫౌండేషన్ చైర్మన్ బూడిద రామిరెడ్డి




తరంగాలు, ఇబ్రహీంపట్నం, నవంబర్ 1 : సామాజిక సేవే తమ ఫౌండేషన్ లక్ష్యమని బిఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, రంగారెడ్డి జిల్లా సర్పంచుల ఫోరం సంఘం మాజీ అధ్యక్షులు బూడిద రామ్ రెడ్డి అన్నారు. మండలంలోని పోచారం గ్రామ ప్రజల అభ్యర్ధన మేరకు రోడ్డు ప్రమాద నివారణలో భాగంగా శనివారం 6 బారికేషన్ బోర్డులు అందజేశారు. ప్రయాణికులకు ఏటువంటి ప్రమాదం జరగకుండా బారికేషన్ బోర్డులు పెట్టించినందుకు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ బూడిద రామ్ రెడ్డి కి ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోచారం గ్రామ మాజీ సర్పంచ్ కందికంటి ప్రభాకర్, గ్రామ శాఖ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గోరిగే రమేష్, జగదీష్ లింగం, జ్ఞానేశ్వర్, చందు చారి, చంటి తదితరులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు ఖాయం



తరంగాలు / ఇబ్రహీంపట్నం, నవంబర్ 1 : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు ఖాయమని యాచారం మండల మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, మాజీ జడ్పిటిసి భూపతిగళ్ళ మహిపాల్ లు అన్నారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆదేశాల మేరకు జూబ్లీహిల్స్ నియోజకవర్గం రెహమత్ నగర్ డివిజన్ లో శనివారం వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ఓటర్లను కలిసి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ నాయకులు మూడేడ్ల వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల వద్దకే ప్రజా పాలన వస్తుంటే జీర్ణించుకోలేని బిఆర్ఎస్

వర్ధన్నపేట ప్రతినిధి, నవంబర్ 01, తరంగాలు : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేరువ అవుతూ ప్రజా పాలనను నేరుగా గ్రామస్థాయికి తీసుకెళుతుంటే బీఆర్ఎస్ నేతలు అసహనం వ్యక్తం చేయడం దురదృష్టకరం అని అయినవోలు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బరిగల భాస్కర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వం అంటే ఇదేనని కాంగ్రెస్ ప్రభుత్వం నిరూపిస్తోందన్నారు. ప్రజా పాలన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్తూ ప్రతి గ్రామంలో అధికారులను అందుబాటులో ఉంటున్నారని, బిఆర్ఎస్ పాలనలో ప్రజలు, అధికారులు, నేతలను కలవడం కూడా కష్టమయ్యేదని ఈ సందర్భంగా గుర్తు చేశారు ప్రజలకు చేరువైన పాలన జీర్ణించుకోలేక టిఆర్ఎస్ నేతలు విమర్శలు చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పునరుద్ధరించి



ప్రతి గ్రామానికి మంజూరు చేసిందన్నారు. బిఆర్ఎస్ పాలనలో మాటలతో ప్రజలు మభ్యపెట్టారు తప్ప ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇచ్చిన దాఖలాలు లేవు అన్నారు. పదేళ్లలో టిఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని,కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు జారీ చేయడంతో పాటు నిరుపేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తుందని, దీనికి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీని అమలు చేసి రైతుల భారాన్ని తగ్గించిందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం నాలుగు దఫాలుగా వాయిదా వేసి రైతులను మోసం చేసిందన్నారు.ఫలితంగా అప్పుల భారంతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని చెప్పారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు 24 గంటల ఉచిత కరెంట్‌ను నిరంతరంగా అందిస్తోందన్నారు.బిఆర్ఎస్ పాలనలో మహిళల పేరు మీద ప్రచారం మాత్రమే, కానీ సదు-పాయాలు లేవు అని, యువత - ఉద్యోగాలు కాంగ్రెస్ ప్రభుత్వం నోటిఫికేషన్లు జారీ చేసి నియామక ప్రక్రియను వేగవంతం చేసింది, బిఆర్ఎస్ కాలంలో పేపర్ లీకులు, వాయిదాలు, నిరుద్యోగుల నిరసనలు మాత్రమే జరిగాయని గుర్తు చేశారు.విద్య మరియు విద్యార్థుల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యార్థి రుణ సాయం వంటి పథకాలను బలపరుస్తోంది. బిఆర్ఎస్ పాలనలో ఫీజు బకాయిలతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మాధవి లత ను మర్యాద పూర్వకంగా కలిసిన వన్నాల వెంకట రమణ

వరంగల్ ప్రతినిధి, నవంబర్ 01, తరంగాలు కొంపెల్లి మాధవి లత ను డాక్టర్ వన్నాల వెంకట రమణ మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీచేసిన కొంపెల్లి మాధవి లత వారి సన్నిహితులు పుప్పాల రజినీకాంత్ మేనకోడలు వివాహ వేడుకలో పాల్గొనేందుకు వరంగల్ కు వచ్చారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి ప్రదీప్ రావు క్యాంపు కార్యాలయం లో మాధవి లతను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకట రమణ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, సిద్ధం నరేష్ , మార్టిన్ లూథర్ , అపురూప సాయి , ఇనుముల అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



# పేదలకు నాణ్యమైన కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించాలి

- గ్రామీణ ప్రాంతం చిలుకూరు లో కార్పొరేట్ స్థాయి వైద్య శాల ఏర్పాటు అభినందనీయం
- చిలుకూరు లో యశోద ట్రస్ట్ హాస్పిటల్ ప్రారంభించిన ఎమ్మెల్యే పద్మావతి

తరంగాలు / చిలుకూరు, నవంబర్ 01 : పేదలకు నాణ్యమైన కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించి హాస్పిటల్ దినదిన అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. చిలుకూరు లో నూతనంగా ఏర్పాటు చేసిన యశోద ట్రస్ట్ హాస్పిటల్ ను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మావతి మాట్లాడుతూ వైద్యులు పూర్తి వ్యాపార ధోరణి తో కాకుండా సేవ దృక్పదం తో సేవలు అందించాలన్నారు. నాణ్యమైన వైద్య సేవలు అందించి ప్రజల్లో మంచి గుర్తింపు పొందాలని, పేదలకు అందుబాటు లో ఉండే వైద్య శాలలకు ప్రభుత్వం పక్షాన సహకారాలు అందిస్తామన్నారు. పరిసర ప్రాంతాల ప్రజలు వైద్య శాల సేవలు సద్వినియోగం



చేసుకోవాలన్నారు. వైద్య శాల నిర్వాహకులు మాట్లాడుతూ వైద్యశాల లో జనరల్ వ్యాధులు, యాక్సిడెంట్ కేసులు, చిన్న పిల్లల, గుండె సంబంధిత వ్యాధుల నిర్ధారణ, మహిళల కు ప్రసూతి, దీర్ఘ కాలిక వ్యాధులు బీపీ షుగర్, తో పాటు చర్మ వ్యాధుల చికిత్స, అన్ని రకాల అధునాతన సదుపాయాలతో ల్యాబ్ సదుపా-యాలు ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యశోద ట్రస్ట్ హాస్పటల్ యజమానం కాసాని దశరథ, యశోద గ్రామ శాఖ అధ్యక్షులు సోందుమియా కొడారు బాబు కడియాల వెంకటేశ్వర్లు వట్టి కోటి నాగయ్య గరినే శేషగిరిరావు వట్టికూటి వెంకటేశ్వర్లు అశోక్ ఉపేందర్ సురేష్ రావిలాల ఉత్తేజ్ మంగయ్య శ్రీనివాసరావు నాగేశ్వరరావు బండి కాశయ్య బంధుమిత్రులు స్నేహితులు పాల్గొన్నారు.

# పాపన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలో 381 సెల్ ఫోన్లు రికవరీ


## - జిల్లా అడిషనల్ ఎస్పీ మహేందర్

తరంగాలు / మెదక్, నవంబర్ 01 : పాపన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఇప్పటి వరకు మొత్తం 381 మొబైల్ ఫోన్‌లను గుర్తించి బాధితులకు తిరిగి అందజేశామని అదనపు ఎస్పీ మహేందర్ తెలిపారు. పాపన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలో మొబైల్ ఫోన్‌లు పోగొట్టుకున్న బాధితుల ఫిర్యాదుల మేరకు పోలీసు బృందం సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఆయా ఫోన్‌ల ఐఎంఈఐ నంబర్లతో వాటిని గుర్తించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ మేరకు శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సుమారు రూ. 5 లక్షల విలువ గల మొబైల్ ఫోన్ లను రికవరీ చేసి బాధితులకు



అందజేశారు. అనంతరం అదనపు ఎస్పీ మహేందర్ మాట్లాడుతూ సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) వెబ్ పోర్టల్ ద్వారా 30 మొబైల్ ఫోన్‌లను విజయవంతంగా గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఐఎంఈఐ నెంబర్ లను బ్లాక్ చేయగా విచారణలో 30 ఫోన్‌లు వివిధ ప్రాంతాల్లో వినియోగంలో ఉన్నట్లు గుర్తించగలిగామని, సీఈఐఆర్ సమాచారాన్ని ఆధారంగా తీసుకొని, పోలీసు బృందం తక్షణ చర్యలు తీసుకొని ఆ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నాట్లు తెలిపారు. ప్రజలు తమ మొబైల్ ఫోన్‌ల ఐఎంఈఐ నంబర్లను భద్రపరచుకోవాలని, ఫోన్ పోగొట్టుకున్న వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ మొబైల్స్ రికవరీ లో కృషి చేసిన పాపన్నపేట పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్, కానిస్టేబుల్ నానుసింగ్ లను అదనపు ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# ఫుట్‌బాల్ ఆటగాడిగా శ్రీకాంత్ తనయుడు.. 'ఛాంపియన్' టీజర్ విడుదల




హీరో శ్రీకాంత్ తనయుడు, యంగ్ హీరో రోషన్ మేక ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ఛాంపియన్'. ఈ సినిమా విడుదల తేదీని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ ఏడాది క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 25న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు వెల్లడించింది. ఈ సందర్భంగా సినిమా టీజర్‌ను కూడా విడుదల చేసింది. ఈ టీజర్‌ను బట్టి 'ఛాంపియన్' ఒక స్పోర్ట్స్ డ్రామా అని స్పష్టమవుతోంది. ఇందులో రోషన్ ఫుట్‌బాల్ ఆటగాడి పాత్రలో కనిపించనున్నారు. క్రీడా నేపథ్యంలో సాగే ఈ కథ ఆసక్తికరంగా ఉండబోతున్నట్లు టీజర్ సూచిస్తోంది. ప్రదీప్ అద్వైత్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా, మలయాళ యువ నటి అనస్వర రాజన్ కథానాయికగా నటిస్తోంది. ఈ సినిమాను స్వప్న సినిమాస్, జీ స్టూడియోస్, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ వంటి ప్రముఖ నిర్మాణ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. 'పెళ్లిసంద%ఱ%' తర్వాత రోషన్ నటిస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు ఉన్నాయి.

# నాలుగు గంటల సినిమా అయినా అద్భుతం..
## - 'బాహుబలి'పై విదేశీయుల రివ్యూలు

- 'బాహుబలి ది ఎపిక్' పేరుతో రెండు భాగాలు కలిపి రీ-రిలీజ్ చేసిన రాజమౌళి
- తొలి రోజే రూ.10.4 కోట్ల నెట్ వసూళ్లు సాధించిన చిత్రం
- ప్రపంచవ్యాప్తంగా సినిమాకు వెల్లువెత్తుతున్న ప్రశంసలు
- సినిమా కాదు.. ఒక కావ్యం అంటూ ఫ్యాన్స్ కితాబు
- హాలీవుడ్ స్టార్ వార్స్, మార్వెల్ చిత్రాలను మించిందన్న రివ్యూలు




దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి సృష్టించిన అద్భుతం 'బాహుబలి' ఏళ్ల తర్వాత కూడా బాక్సాఫీస్ వద్ద తన సత్తా చాటుతోంది. 'బాహుబలి: ది బిగినింగ్', 'బాహుబలి: ది కన్‌క్లూజన్' చిత్రాలను కలిపి 'బాహుబలి ది ఎపిక్' పేరుతో శుక్రవారం థియేటర్లలో రీ-రిలీజ్ చేశారు. ఈ రీ-రిలీజ్‌కు కూడా ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నారు. ప్రముఖ ట్రేడ్ వెబ్‌సైట్ శాక్‌నిల్క్ డాట్‌కామ్ ప్రకారం ఈ చిత్రం తొలి రోజే భారతదేశంలో రూ.10.4 కోట్ల నెట్ వసూళ్లను సాధించి అందరినీ ఆశ్చర్యపరిచింది. భారత్‌లోనే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులు ఈ చిత్రంపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా తమ అనుభవాలను పంచుకుంటూ జక్కన్న మేజిక్‌ను కొనియాడుతున్నారు. "విదేశీ ప్రేక్షకులు ఈ ఎపిక్‌ను చూసి ఆనందంతో ఉప్పొంగిపోతున్నారు. లెటర్‌బాక్స్‌డ్ రివ్యూలు అద్భుతంగా ఉన్నాయి" అంటూ 'బాహుబలి' చిత్ర బృందం అధికారిక ఇన్‌స్టాగ్రామ్ పేజీలో పేర్కొంది. దాదాపు నాలుగు గంటల నిడివి ఉన్నా, ప్రతి క్షణం అద్భుతంగా ఉందని, ఈ సినిమా ముందు ఇప్పటివరకు వచ్చిన ఏ చిత్రమూ సరితూగదని అంతర్జాతీయ ఫ్యాన్స్ అభిప్రాయపడుతున్నారు. ఒక అభిమాని తన రివ్యూలో, "ఇది నా జీవితంలో చూసిన గొప్ప చిత్రం. థియేటర్‌లో అందరి కేకలు, చప్పట్ల మధ్య ఈ సినిమాను చూడటం ఒక మరపురాని అనుభవం" అని రాశారు. మరో ప్రేక్షకుడు స్పందిస్తూ "పశ్చిమ దేశాల వారికి 'స్టార్ వార్స్' ఎలాంటిదో, నాకు 'బాహుబలి' అలాంటిది. ఇది కేవలం యాక్షన్, డ్రామా మాత్రమే కాదు... ఇదొక కావ్యం, ఒక పురాణం" అని పేర్కొన్నాడు. మరికొందరు ఈ చిత్రాన్ని "ఒక ఒపెరా (సంగీత నాటకం)" అని అభివర్ణిస్తూ, తెలుగు సినిమా సత్తాను ప్రపంచానికి చాటిన చిత్రమని కొనియాడారు. అమెరికాకు చెందిన ఓ ప్రేక్షకుడు, "ఈ సినిమా ఏ మార్వెల్ సినిమా కన్నా గొప్పది. ఫాంటసీ జానర్‌లో ఇంతకంటే ఉత్తమమైన సినిమా లేదు" అని ప్రశంసించారు. రాజమౌళి దర్శకత్వ ప్రతిభ, నటీనటుల అద్భుత నటన, కీరవాణి సంగీతం ప్రేక్షకులను మరోసారి మంత్రముగ్ధులను చేస్తున్నాయి. 2015, 2017లో విడుదలైన 'బాహుబలి' రెండు భాగాలు ప్రపంచవ్యాప్తంగా రూ. 2000 కోట్లకు పైగా వసూళ్లు సాధించి తెలుగు సినిమా స్థాయిని పెంచాయి. ప్రభాస్, రానా దగ్గుబాటి, అనుష్క శెట్టి, తమన్నా భాటియా, రమ్యకృష్ణ, సత్యరాజ్, నాజర్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని ఇప్పుడు ఒకే భాగంగా రీమాస్టర్ చేసి విడుదల చేయడం విశేషం.

# మహేశ్ బాబు - రాజమౌళి సినిమా నుంచి కీలక అప్డేట్..!



సూపర్ స్టార్ మహేశ్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో రాబోతున్న భారీ చిత్రంపై ఓ కీలక అప్‌డేట్ వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమా టైటిల్, ఫస్ట్ గ్లిమ్స్‌ను నవంబర్ 15న విడుదల చేయ-ంబోతున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ సినిమాకు సంబంధించి నవంబర్ 15వ తేదీన హైదరాబాద్‌లో ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఈ ఈవెంట్‌లో భాగంగానే సినిమా అధికారిక టైటిల్‌ను ప్రకటించి, ఓ పవర్‌ఫుల్ గ్లిమ్స్‌ను విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. ప్రముఖ నిర్మాత కేఎల్ నారాయణ నిర్మిస్తున్న ఈ చిత్రంపై దేశవ్యాప్తంగా అంచనాలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఇప్పటివరకు ప్రచారంలో ఉన్న అనేక టైటిల్స్‌కు, ఇతర ఊహాగానాలకు ఈ ప్రకటనతో రాజమౌళి ఫుల్‌స్టాప్ పెట్టనున్నారు. ఇప్పటికే ఈ చిత్రంలో మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్, గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా కీలక పాత్రలు పోషిస్తున్నట్లు స్పష్టమైంది. అయితే, ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా మాత్రం నటించడం లేదని, ఆమెది కేవలం ఒక ముఖ్యమైన పాత్ర మా-త్రమేనని చిత్ర వర్గాలు స్పష్టం చేశాయి. దీంతో ఈ చిత్రంలో మహేశ్ సరసన నటించే కథానాయిక ఎవరనే దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ చిత్రానికి ఆస్కార్ విజేత ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు. ఫారెస్ట్ అడ్వెంచర్ థ్రిల్లర్‌గా ఈ సినిమా తెరకెక్కుతోందనే ప్రచారం జరుగుతున్నప్పటికీ, దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. నవంబర్ 15న రాబోయే అప్‌డేట్‌తో ఈ ప్రాజెక్ట్‌పై మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉంది.

# 'అచ్చియమ్మ'గా జాన్వీ కపూర్...
## - రామ్ చరణ్ 'పెద్ది' నుంచి ఫస్ట్ లుక్ విడుదల!



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, 'ఉప్పెన' ఫేమ్ డైరెక్టర్ బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రం 'పెద్ది'. భారీ అంచనాల మధ్య రూపుదిద్దుకుంటున్న ఈ సినిమా నుంచి మేకర్స్ ఓ కీలక అప్‌డేట్‌ను విడుదల చేశారు. ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తున్న బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ ఫస్ట్ లుక్‌ను, ఆమె పాత్ర పేరును అధికారికంగా పరిచయం చేశారు. ఈ సినిమాలో జాన్వీ కపూర్ 'అచ్చియమ్మ' అనే పల్లెటూరి యువతి పాత్రలో కనిపించనుంది. విడుదల చేసిన పోస్టర్‌లో ఆమె డీగ్లామర్ లుక్‌లో ఆకట్టుకుంటోంది. "పెద్ది ప్రేమించే ఫైర్‌బ్రాండ్ ఆటిట్యూడ్ ఉన్న అమ్మాయి అచ్చియమ్మ" అంటూ చిత్రబృందం ఆమె పాత్రను అభిమానులకు పరిచయం చేసింది. ఈ లుక్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. జాన్వీ పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా, కథలో కీలకంగా ఉండబోతోందని తెలుస్తోంది. ఈ పాన్-ఇండియా ప్రాజెక్ట్‌లో కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండగా, రత్నవేలు సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాపై మెగా అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. ఈ చిత్రాన్ని 2026 మార్చి 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు

# ఓ ఊరిలో వింత పరిణామాలు..
## ఉత్కంఠ రేపుతున్న 'శంబాల' ట్రైలర్




యువ హీరో ఆది సాయికుమార్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'శంబాల.. ఏ మిస్టిక్ వరల్డ్'. సూపర్ నాచురల్ హారర్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా నుంచి మేకర్స్ తాజాగా ట్రైలర్‌ను విడుదల చేశా-రు. ఉత్కంఠభరితమైన సన్నివేశాలతో కూడిన ఈ ట్రైలర్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని డిసెంబర్ 25న క్రిస్మస్ కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు ప్రకటించారు. ట్రైలర్‌ను గమనిస్తే, "కొన్ని వేల సంవత్సరాల క్రితం పరమశివుడికి, అసురుడికి మధ్య జరిగిన భీకర యుద్ధం ఈ కథకి మూలం" అంటూ నటుడు సాయికుమార్ గంభీరమైన వాయిస్ ఓవర్‌తో ప్రారంభమైంది. ఆకాశం నుంచి ఓ ఉల్క లాంటి రాయి భూమిపై ఒక గ్రామంలో పడటం, ఆ తర్వాత నుంచి అక్కడి ప్రజలు వింతగా ప్రవర్తించడం వంటి అంశాలు కథలో కీలకమైనవిగా తెలుస్తోంది. ఈ చిత్రంలో ఆది సాయికుమార్ ఒక భౌగోళిక శాస్త్రవేత్త (జియాలజిస్ట్) పాత్రలో కనిపించనున్నారు. ఆ ఊరిలో జరుగుతున్న వింత పరిణామాల వెనుక ఉన్న రహస్యాన్ని ఛేదించి, ప్రజలను ఎలా కాపాడారనేదే ఈ సినిమా కథాంశం. తన కెరీర్‌లో ఇదొక ఛాలెంజింగ్ పాత్ర అని తెలుస్తోంది. యుగంధర్ ముని దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో అర్చన అయ్యర్, స్వాసిక హీరోయిన్‌లుగా నటిస్తున్నారు. రాజశేఖర్ అన్నభీమోజు, మహీధర్ రెడ్డి సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. విభిన్నమైన కథాంశంతో వస్తున్న ఈ సినిమాతో ఆది సాయికుమార్ మంచి విజయాన్ని అందుకుంటారని చిత్రబృందం ధీమా వ్యక్తం చేస్తోంది.

Printed,Published by,Owened by GADDAM NAGARAJU & Printed at ,arun publication ,HNO 51/1 indhiramma colony,phase 1,nizampet, Hyderabad RNI. NO TELTEL/2022/83463 & Published at .HNO 3-123shivanagar colony,Ellanda, Wardhannapet, warangal 506313.. telangana
EDITOR : GADDAM NAGARAJU . CELL :9494923460 . Website : WWW.tharangalu.com Email : nagarajugaddam009@gmail.com